ప్రజాశక్తి

ఆదివారం 30 జూన్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సంక్షేమానికి ప్రాధాన్యత

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

- రాజకీయాలకు అతీతంగా పింఛన్ల పంపిణీ
- జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశంలో ఛైర్‌పర్సన్ సుభద్ర
- గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ, సామాన్య ప్రజల ఆర్థిక పురోగతికి అధికారులు తోడ్పాటు అందించాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరం, ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో జరిగాయి. ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్యం, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చలు జరిగాయి. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు సంధించగా ఆయా శాఖల అధికారులు బదులిచ్చారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికైన నారా చంద్రబాబు నాయుడుకు, శాసనసభ్యులకు జిల్లా పరిషత్ తరపున శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు పలు కమిటీల్లో సభ్యులుగా ఉంటారని, ఆ విషయమై చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని అన్నారు. రూ.3 వేలు ఉండే పింఛన్‌ను నూతన ప్రభుత్వం రూ.4 వేలకు పెంపుదల చేయడం హర్షనీయమని అన్నారు. పెంపుదల చేసిన పింఛన్‌ను సచివాలయ సిబ్బంది ద్వారా సోమవారం ఉదయం 6 గంటల నుంచి పింఛనుదారుల ఇంటి వద్దే పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్షేమ ఫలాల పంపిణీలో జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, వారికి సమాచారం లేకుండా ప్రభుత్వ పథకాలను పంపిణీ చేయడం సరికాదని అన్నారు. గత ప్రభుత్వంలో మిగతా 2లో..

వార్త 2లో..

అయ్యన్నకు స్వాగతం పలుకుతున్న నగర ప్రముఖులు

స్పీకర్ స్థానానికి
గౌరవం పెరిగేలా పని చేస్తా : అయ్యన్న

ఘనంగా సురభి నాటకోత్సవాలు ప్రారంభం

- కళాభారతికి భారీగా తరలొచ్చిన జనం
- తొలిరోజు మాయాబజార్ నాటకం ప్రదర్శన

మాయాబజార్ నాటకాన్ని రక్తికట్టిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సురభి సంస్కృతిని బతికిద్దామని, పౌరాణిక రంగాన్ని నిలబెడదామని విజయ నిర్మాణ సంస్థ అధినేత విజయ్ కుమార్ పేర్కొన్నారు. నాటక రంగ మనుగడకు విశాఖ వాసి బాదంగీర్ సాయి చేస్తున్న విశేష కృషిని కొనియాడారు. శనివారం నుంచి వారం రోజులపాటు కళాభారతి ఎసి ఆడిటోరియంలో జరిగే సురభి నాటకోత్సవాలను ఆయన ప్రారంభించారు. తొలిరోజు శ్రీ భానోదయ నాట్య మండలి (సురభి) హైదరాబాద్ సభ్యులు సురభి 140వ వార్షికోత్సవం సందర్భంగా కళాభారతి ప్రాంగణంలో మాయా బజార్ నాటకం ప్రదర్శించారు. రంగసాయి నాటక సంఘం - కళా భారతి సహకారంతో ఏర్పాటు చేసిన తొలి రోజు కార్యక్రమానికి సూరపనేని విజయ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్తరాంధ్రలో నాటక సంస్కృతి పురోగతికి అందరూ కృషి చేయాలన్నారు. బాదంగీర్ మిగతా 2లో..

ఉద్యోగవిరమణ శుభాకాంక్షలు

శ్రీమతి & శ్రీ బుడ్డెపు శ్రీనివాసరావు - నాగలక్ష్మి దంపతులు
ప్రధానోపాధ్యాయులు,
జిల్లా పరిషత్ హైస్కూల్, ఆనందపురం, విశాఖపట్న జిల్లా.

ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు
పొంది నేడు ఉద్యోగవిరమణ చేయుచున్న
మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ..
మీ బావి జీవితం ఆనందమయం కావాలని కోరుకుంటూ..

కుమారులు : ప్రవీణ్‌కుమార్
కుమార్తె : హారిక

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో
పనిచేసి అందరి మన్ననలు పొంది
నేడు "ఉద్యోగ విరమణ" చేయుచున్న
మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు
తెలియజేస్తూ... మీ బావి జీవితం
ఆనందమయం కావాలని కోరుకుంటూ..

కుమారుడు	కోడలు
శిర్లాం తరుణ్ కుమార్	శిర్లాం లిప్సా పట్నాయక్
కుమార్తె	**అల్లుడు**
బోగీల భార్గవి పట్నాయక్	బోగీల వినోద్ పట్నాయక్

మనవలు : శిర్లాం ప్రతీక్ తేజస్, బోగీల పూర్ణిత

శ్రీమతి & శ్రీ శిర్లాం గోవిందరావు-శారద దంపతులు
ఆర్టీసీ కండక్టర్, కూర్మన్నపాలెం బస్ డిపో, విశాఖపట్నం.

ఉద్యోగవిరమణ శుభాకాంక్షలు

నీతి నిజాయితీలకు మారుపేరుగా వుంటూ,
మా జీవితాలకు మంచిదారిని చూపి
సమాజంలో మాకంటూ ప్రత్యేకస్థానాన్నిచ్చిన
మీకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేం...
ఉద్యోగ జీవితంలో అవిశ్రాంతంగా పనిచేసిన
మీరు ఉద్యోగవిరమణ అనంతరం ప్రశాంత జీవితం
గడపాలని కోరుకుంటూ...

శ్రీమతి & శ్రీ ఓబిలి శ్రీనివాసరావు-బుజ్జిమ్మ దంపతులు
గ్రంథాలయ మాస్టర్, దేవరాపల్లి

కుమారులు :
రవితేజ, సాయికిరణ్
మరియు బంధుమిత్రులు

దేవరాపల్లి గ్రామం, దేవరాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా.

మొదటి పేజీ తరువాయి..

సంక్షేమానికి ప్రాధాన్యత

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాల పంపిణీ జరిగేదని, అదే తరహా కొనసాగాలని అధికారులను కోరారు. స్థాయీ సంఘాల సమావేశాలకు కొందరు అధికారులు గైర్హాజరు కావడం పట్ల ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ఇటువంటివి పునరావృతమైతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళల ఆర్థిక ప్రగతికి అధికారులు కృషి చేయాలని, మైదాన ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాల్లోనూ రహదారులు, విద్యుత్ వంటి వాటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని అన్నారు. 5 ఏళ్లలోపు పిల్లలు జిల్లాలో లక్షా 38 వేల మంది ఉన్నారని, వారికి అతిసార సోకకుండా ఉండేందుకు ప్రతి ఇంటికీ రెండు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్‌లను ఆశా వర్కర్ల ద్వారా పంపిణీ చేయడమే కాకుండా, సీజనల్ వ్యాధులు సోకాకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చైర్‌పర్సన్‌కు తెలిపారు. అతిసార సోకిన పిల్లల కోసం కెజిహెచ్‌లో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం, బెడ్లు ఏర్పాటు చేశామని, ఆ బృందం తక్షణమే స్పందించి వైద్యం అందిస్తుందని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు.

అరకు ఎమ్మెల్యేకు సత్కారం

తొలుత అరకు నియోజకవర్గ శాసనసభ్యునిగా ఎన్నికైన జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగానికి జిల్లా పరిషత్ తరపున అభినందనలు తెలియజేశారు. శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.పోలినాయుడు, డిప్యూటీ సిఇఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సురభి నాటకోత్సవాలు ప్రారంభం

సాయి మాట్లాడుతూ జీవితాంతం కళారంగ సేవలోనే ఉంటానన్నారు. కార్యక్రమంలో నాటకోత్సవ నిర్వాహకులు నాగబోయిన నాగేశ్వరరావు, రచయిత కొరటాల ప్రభాకర్, పిల్లా రమణమూర్తి, మేడా మస్తాన్ రెడ్డి, వర్రె నాంచారయ్య, రంగస్థల నటీమణి శివజ్యోతి, రవి బ్రహ్మ, భానోదయ నాట్యమండలి ప్రతినిధి నాగబాబు తదితరులు పాల్గొన్నారు. సురభి నాటకోత్సవాలు ప్రారంభమవుతున్నాయని తెలిసి ఒక్కసారిగా జనం భారీగా తరలిరావడంతో కళాభారతి ఆడిటోరియం హౌస్‌ఫుల్‌గా కనిపించింది. చాలా మంది బయటే ఉండిపోయారు.

స్పీకర్ స్థానానికి గౌరవం పెరిగేలా పని చేస్తా : అయ్యన్న

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్పీకర్ స్థానానికి మరింత గౌరవం పెరిగేలా పని చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. అతి చిన్న వయసులో ఎన్‌టిఆర్ మంత్రి పదవి ఇచ్చారని, ఇప్పుడు చంద్రబాబు స్పీకర్ పదవి ద్వారా అత్యున్నత గౌరవం ఇచ్చి ప్రధాన బాధ్యతలు అప్పగించారని అన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పరిమితులకు లోబడి హుందాగా పని చేస్తానని పేర్కొన్నారు. స్పీకర్‌గా ఎన్నికై బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన శనివారం తొలిసారిగా విశాఖపట్నానికి విచ్చేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ పైమేరకు స్పందించారు. విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్‌పి మరళీకృష్ణ, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, పోలీసు అధికారులు విశాల్ గున్ని, మేకా సత్తిబాబు, స్థానిక నేతలు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన నేతలు, అధికారులు స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

7న లతారాజా ఫౌండేషన్ ఉపకారవేతన పరీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో దేశ వ్యాప్తంగా సేవలందిస్తున్న హైదరాబాద్‌కు చెందిన లతా రాజా ఫౌండేషన్ ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి స్కాలర్‌షిప్స్ అందించేందుకు జులై 7న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కెకె.రాజా తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలోని ఎండాడ వద్దగల ఎయిమ్స్ కాలేజీలో ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, ఆపరేషన్స్, రిటైల్, ఫారిన్ ట్రేడ్ మేనేజ్‌మెంట్ (పిజిడిఎం)లో ఐదుగురికి వంద శాతం ఆర్థిక సహాయం, యాక్ట్స్ కాలేజ్ డిగ్రీలో బిటిఎ, బి.కామ్ (జనరల్ కంప్యూటర్), బిఎస్సీ కంప్యూటర్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి ఏడు కోర్సుల నుండి ఇద్దరు చొప్పున 14 మంది విద్యార్థులకు వంద శాతం ఆర్థిక సహాయాన్ని అందించడానికి ఈ స్కాలర్‌షిప్ పరీక్షను నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ సిద్ధోజీరావు మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేశారు. స్కాలర్‌షిప్ టెస్టుకు అర్హత కలిగినవారు 9866870179, 8142657359 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అంతర్జాతీయ నృత్య పోటీలలో అవార్డులు అందుకున్న స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్‌కి చెందిన ఆర్‌హెచ్.టీనా, డి.లక్ష్మిస్నేహిత, జి.డింపుల్, మానియ సంఘవిలను రాజా ఘనంగా సత్కరించారు.

ఆరోగ్యకర ఆహారానికే ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాత్రిపూట తీసుకునే ఆహారంలో పోషకాలు కలిగిన వాటికి, ఆరోగ్యకరమైన ఆహారానికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రముఖ వైద్యులు, పోషకాహార నిపుణులు డాక్టర్ రోహిణి పాటిల్ తెలిపారు. ఆహారం – ఆరోగ్యం అనే అంశంపై శనివారం ఓ హోటల్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ రాత్రి వేళ కాటేజీ చీజ్, బాదం, గ్రీక్ యోగర్ట్, కివి పండ్లు, చెర్రీ టమాటాలు, హార్డ్ బాయిల్డ్ గుడ్లును ఆహారంగా తీసుకోవడం మంచిదన్నారు. ఇవి ఆకలిని తీర్చడమే కాకుండా బరువు తగ్గడానికి దోహదపడతాయని అన్నారు.

ఉక్కు పరిరక్షణ భరోసా ఏదీ ?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విశాఖ ఉక్కు పరిశ్రమ మెడపై కత్తి వేలాడుతున్నా, ఆ ప్రమాదం నుంచి పరిశ్రమను తప్పించి రక్షించాలన్న ఆలోచన, ఆరాటం కూటమి ప్రభుత్వంలో ఏ కోశానా కనిపించకపోవడం విచారకరం. ప్రభుత్వం ఏర్పడి రోజులే కావచ్చుగానీ, దారితప్పుతున్న దాని అడుగులు ఆందోళనకరంగానే వున్నాయి. పరిశ్రమను ఆదుకుంటామన్న ఆశ, భరోసా కూటమి నుంచి వినిపించడంలేదు. ఉక్కు పరిశ్రమ సాధనకు తెలుగు ప్రజలొడ్డిన ప్రాణ త్యాగాలకు విలువలేకుండా చేస్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వ కుటిల చేష్టలపై గత వైసిపి ప్రభుత్వం వలే కూటమి ప్రభుత్వం కూడా కళ్లు మూసుకుంటోంది. ఉక్కు పరిశ్రమను ముక్కముక్కలుచేసి మార్కెట్‌లో పెడుతుంటే ప్రతిఘటించకుండా ఊగిసలాడి సాగిలపడ్డం కనిపిస్తోంది. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ చర్యలను ప్రశ్నించలేని, ఎదిరించలేని, బతిమలాడైనా అడ్డుకోలేని, ఆత్మస్థైర్యంలేని పార్టీలు ఆశీనులై నేడు రాష్ట్రంలో కూర్చున్నాయి. 'కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి అవసరమైన నిధులు సాధించి రాష్ట్ర పునర్నిర్మాణానికి కృషిచేస్తాం' అని టిడిపి, జనసేన ఎన్నికల ఉమ్మడి మ్యానిఫెస్టో మొదటి పేజీలోని ముందుమాటలో చివరి వాక్యంగా వుంది. ఆ మ్యానిఫెస్టోలోని ఉత్తరాంధ్ర అభివృద్ధిలో 'విశాఖ ఉక్కును పరిరక్షిస్తాం' అని నాలుగో అంశంగా పేర్కొన్నాయి. ఈ నెల 24న జరిగిన మంత్రివర్గ సమావేశ నిర్ణయాల్లో పింఛన్ పెంపు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ తప్ప ప్రజలు బలంగా చెప్పుకొనే మేలైన అంశాలు అంతంగా లేవు. ఈ మంత్రివర్గంలో బాబు సూపర్ -6 హామీల్లో ఏ ఒక్కటీ తెరమీదకు రాలేదు.



శతశాతం ఉక్కు పరిశ్రమను అమ్మాలన్న మోడీ ప్రభుత్వ ఆలోచనలో భాగంగా ఇప్పటికే వివిధ ప్రాంతాల్లోని విలువైన ఆస్తులను స్టీల్ యాజమాన్యం అమ్మకానికి పెట్టింది. పరిశ్రమను అమ్మాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం, వామపక్షాలు, సిఐటియు, ఇతర కార్మిక సంఘాల డిమాండ్‌కు బలపర్చాల్సిన రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన, బిజెపి ఎంపీలు మౌనందాల్చుతున్నారు. తామేదో చేస్తున్నట్లు సెయిల్‌లో విలీనం చేయాలన్న పాత డిమాండ్‌ను అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, పురంధరేశ్వరి ఉక్కుశాఖ మంత్రికి వినతి రూపంలో కొత్తగా ఇవ్వడం హాస్యాస్పదంగా వుంది. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, అమ్మకానికి పెట్టొద్దని, పూర్తిస్థాయి ఉత్పత్తికి ఆటంకంలేకుండా చూడాలని ప్రధానికి ఎందుకు వినతిపత్రం ఇవ్వలేదో వారు చెప్పాలి.

ప్రధాని దగ్గరకు వెళితే అమ్మకపు ప్రక్రియంతా ఆగిపోయేదని అనకాపల్లి వారాహి విజయభేరి యాత్రలో కార్మిక సంఘాలపై నిందమోపిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇప్పుడు ఏం చేస్తున్నారు ? ఇప్పుడు ఎన్‌డిఎలో భాగస్వామిగావున్న ఆయన్ని స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టొద్దని ప్రధాని దగ్గరకు వెళ్లకుండా ఎవరు అడ్డగిస్తున్నారు ?. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయం ఉపసంహరించుకొని, సొంతగనులు కేటాయించాలని మంత్రివర్గ సమావేశంలో కూటమి ప్రభుత్వం ఎందుకు తీర్మానం చేయలేదు? అన్న వాటిపై ప్రస్తుతం చర్చ నడుస్తోంది.

రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కిన జిల్లాకు చెందిన హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూటమి ప్రభుత్వంలో పరిశ్రమను రక్షించుకోవడానికి తగిన పాత్ర పోషించినప్పుడే ఆ పదవులకు గౌరవం దక్కుతుంది.

హెల్త్ సెక్రటరీలను

మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్‌కు కేటాయించాలి

ఎన్నికైన అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హెల్త్ సెక్రటరీలను మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్‌కు పూర్తిగా కేటాయించాలని యునైటెడ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మాధవి డిమాండ్ చేశారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో సంఘం విశాఖ జిల్లా మహాసభ, నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహన్‌రావు, హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మాధవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ప్రభుత్వం పని భారం తగ్గించాలని, అడల్ట్ బిసిజి వాక్సినేషన్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలని, అనవసరమైన యాప్‌లన్నీ రద్దు చేయాలని, పబ్లిక్ హాలీడేస్, ఆదివారం సెలవుల్లో పని చెప్పవద్దని కోరారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. మహాసభకు రాష్ట్ర కోశాధికారి చుక్కల సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు సాయిప్రసాద్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, ముఖ్య నాయకులు చిట్టిబాబు, సాంబమూర్తి హాజరయ్యారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలుగా పి.మణి, అధ్యక్షురాలుగా నిర్మల, ప్రధాన కార్యదర్శిగా సుభాషిణి, కోశాధికారిగా ప్రసన్న, సహాయ కోశాధికారిగా భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా రాజ్యలక్ష్మి, కృప, శైలజ, భారతి, ప్రమీల, సహాయ కార్యదర్శులుగా రాణి, రమ్య, కనకరత్నం, కల్యాణి, జాయ్, విజయకుమారి, మరో 12 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా ఎన్నికయ్యారు.

సమస్యలపై స్పందించేవారే కరువు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాజంలో ఎదుటివారి సమస్యల పట్ల స్పందించే వారే కరువయ్యారని ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, అడిషనల్ డిఎంఇ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. శనివారం ఎఎంసిలో గ్రంథాలయం ఉద్యోగి కొండా శంకరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమస్యల పట్ల శంకరరావు స్పందించిన తీరును అభినందించారు. మానవతా విలువలు కలిగిన శంకరరావు సేవలు ఉద్యోగ విరమణ తర్వాత కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి, ఎఎంసి లైబ్రేరియన్ బి.శ్రీనివాసరావు, సహాయ లైబ్రేరియన్ పి.శ్రీనివాసరావు, ఎఒ రాఘవరావు, మాజీ లైబ్రేరియన్ మాధవరావు, కెజిహెచ్ ఉద్యోగి అమర్‌నాథ్ పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌ను విడుదల చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సీతల్ మదన్ డిమాండ్ చేశారు. శనివారం కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపి నియంతృత్వ పాలన నశించాలని డిమాండ్ చేశారు.

బహిరంగ ప్రకటన

యిందుమూలంగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా విశాఖపట్నం, గాజువాక మండలం, అగనంపూడి పోస్టు, అగనంపూడి శివారు, తలారివారిపాలెం, డో.నెం. 4-88/9 కాపురస్తులు మా క్లయింటు అయిన శ్రీ లేటు కంబాల గురువులుగారి కుమారుడు శ్రీ కంబాల శంకరరావుగారికి అనకాపల్లి జిల్లా రిజిస్ట్రేషన్, సబ్బవరం సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిష్టర్డు కాబడిన క్రయదస్తావేజు నెం. 471/2003 తేది: 13-02-2003ను తీసుకుని తేది: 01-06-2024 ఉదయం సుమారు 11 గంటలకు డో.నెం. 4-88/9, తలారివాని పాలెం, అగనంపూడిలో గల యింటి నుండి మోటూరు సైకిల్ పై బయలుదేరి కూర్మన్న పాలెం వెళుతూ ఉండగా దారిలో ఎక్కడో వారి యొక్క పైన చెప్పబడిన క్రయదస్తావేజు పడిపోయినది. ఈరోజు వరకు ఎంత వెతికినను కనబడలేదు. కావున యావన్మందికి విజ్ఞప్తి చేయునది ఏమనగా పై క్రయదస్తావేజు నెం. 471/2003 తేదీ: 13-02-2003, ఎవరికైన దొరికినచో మా క్లయింటు యొక్క క్రింది యిచ్చిన అడ్రసుకు అప్పజెప్పవలసిందిగా కోరి ప్రార్థించుచున్నాము.

అడ్రస్ : కంబాల శంకరరావు, తండ్రి లేటు శ్రీ కంబాల గురువులు డో.నెం. 4-88/9, తలారివానిపాలెం, అగనంపూడి, విశాఖపట్నం.

బి.మురళీకృష్ణరాజు అడ్వకేట్,
ప్లాట్‌నెం.109, మరియు 110, భవానీనగర్,
బి.సి.రోడ్డు, గాజువాక, విశాఖపట్నం.

గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, విజయవాడ.
F.A.NO. 100/2023,
F.A.I.A.NO. 598/2023లో

Between :
శ్రీమతి పొట్నూరు వెంకట లక్ష్మి,
W/o. late Potnuru Satyanarayana, హిందువు వయస్సు సుమారు 30 సంవత్సరాలు, R/o.D.నం. 3-1-158, అన్నవరమా వీధి, చోడవరం మండలం, విశాఖపట్నం-531036.
...పిటిషనర్/అప్పీలుదారు/ ఫిర్యాదుదారు
మరియు
2. Aviva Life Insurance Company Ind. Pvt. బ్రాంచ్ మేనేజర్, బ్రాంచ్ ఆఫీస్, D.No. ద్వారా పరిమిత ప్రతినిధి. 47-1-8, 3వ అంతస్తు, ఇన్సార్ సత్య కాంప్లెక్స్, మెయిన్ రోడ్, ద్వారకానగర్, విశాఖపట్నం-530016.
...ప్రతివాది

పై కమిషన్ వారి ఉత్తర్వులు మేరకు పైన తెలిపిన వాజ్యము తమ పదర్శన కొసం 11-07-2024కి పోస్ట్ చేయబడింది. గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, అశోక్ నగర్, విజయవాడ ముందు **మీరు 11-07-2024 ఉదయం 10.30 గంటలకు** వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా హాజరు కావచ్చు. హాజరు కాని పక్షంలో పై వాజ్యమును విమర్శన చేసి తీర్మానించదగునని మీరు తెలుసుకోగలరు.
I.A.No. 672/20024లో రాష్ట్ర కమిషన్ ఆదేశం మేరకు ఈ నోటీసు జారీ చేయబడింది.

S/d. మన్నె హరి బాబు
న్యాయవాది
27-6-84, 2వ అంతస్తు, శ్రీ కృష్ణ ఎస్టేట్స్, ప్రకాశం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ-520002, A.P.,
సెల్: 94404 82681

ఎపిఎల్ సీజన్-3 ట్రోఫీ ఆవిష్కరణ

- రేపటి నుంచి వైజాగ్‌లో మ్యాచ్‌లు ప్రారంభం
- అందరికీ ఉచిత ప్రవేశం

ఎపిఎల్ సీజన్-3 ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఆంధ్ర ప్రీమియర్ లీగ్ మూడవ సీజన్ ఆదివారం నుంచి వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రారంభం కానుంది. మొత్తంగా 19 మ్యాచ్‌లు జరగనున్నాయి. మ్యాచ్‌లు జులై 13వ తేదీన ముగియనున్నాయి. వైజాగ్‌లోని ఓ హోటల్‌లో ఏపీఎల్ ట్రోఫీతో పాటు జెర్సీనిశనివారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, చెన్నై, కర్ణాటకతో పాటు మరో రాష్ట్రంలో మాత్రమే స్థానిక ప్రీమియర్ లీగ్‌లు ఉండేవని, ఆ తర్వాత ఆంధ్రలో ఏపీఎల్‌ను ప్రారంభించామని చెప్పారు. స్థానిక క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ లీగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో ఏపీఎల్‌లో ప్రాతినిధ్యం వహించిన కెఎస్.భరత్, ఎన్.నితీష్‌కుమార్‌రెడ్డి, రిక్కీ భుయ్, షేక్ రషీద్, పృథ్వీరాజ్, హరిశంకర్ రెడ్డి, ఉమెన్ లీగ్ నుంచి స్నేహ దీప్తి, షబ్నం ఐపిఎల్‌కు ప్రాతినిధ్యం వహించారని వివరించారు. ఏపీఎల్ ఆడుతున్న క్రీడాకారులంతా ఏపీఎల్‌ను వేదికగా చేసుకుని పెద్ద స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. మ్యాచ్‌ను తిలకించేందుకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులతో పాటు క్రికెట్ అభిమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైజాగ్ వారియర్స్ కెప్టెన్ కెఎస్.భరత్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో సమానంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అత్యాధునిక, మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు వి.మురళీమోహన్, డి.అస్కార్‌వినోద్, అపెక్స్ కౌన్సిల్ మెంబర్ ఎన్.గీత, రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్, బెజవాడ టైగర్స్, వైజాగ్ వారియర్స్ జట్ల ఫ్రాంచైజ్లు, కెప్టెన్లు తదితరులు పాల్గొన్నారు.

స్టార్ స్పోర్ట్స్ తెలుగు, స్టార్ స్పోర్ట్స్ ఫస్ట్‌లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

భీమిలి డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తొలిసారిగా ఎమ్మెస్సీ పీజీ కోర్సు ఆర్గానిక్ కెమిస్ట్రీ 2024-25 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పాసై ఎపిపిజి సెట్‌లో క్వాలిఫై అయిన విద్యార్థులు తమ కళాశాలలో పీజీలో చేరవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. తమ కళాశాలలో ఇప్పటివరకు బ్యాచిలర్ డిగ్రీ స్థాయి వరకే ఉండగా, ప్రస్తుతం పీజీ కోర్సు ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

70 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యాన శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 70 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 30 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. శంకర్ ఫౌండేషన్ డాక్టర్ జాక్సన్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో-ఆర్డినేటర్ వై.రాజుప్రసాద్, నర్సింగ్ స్టాఫ్ శిరీష తదితరులు వైద్య సేవలందించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో కసిరెడ్డి దామోదరరావు, కర్నేడి శ్రీరాములు, పుప్పాల వెంకటరమణ, పుప్పాల వెంకట్రావు, మద్దిల వెంకటరమణ పాల్గొన్నారు.

అందుబాటులో పెయ్య దూడల ఉత్పత్తి పథకం

ప్రజాశక్తి-ఆనందపురం : పశుసంవర్ధక శాఖ ద్వారా రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చినట్లు పశు సవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన ఆనందపురం పశు వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాలలో మేలు జాతి లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం వల్ల పెయ్యదూడలను ఎక్కువగా ఉత్పత్తి చేసి తద్వారా పాల దిగుబడిని పెంపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా కృత్రిమ గర్భధారణకు ఒక్కొక్కటి రూ.675 చెల్లించాలని, లింగ నిర్ధారిత వీర్యనాళికలను రెండు పర్యాయాలు కృత్రిమ గర్భధారణ కోసం సబ్సిడీపై అందించనున్నట్లు వివరించారు. లింగ నిర్ధారిత వీర్యనాళికలలో ముర్రా, జెర్సీ, హెచ్ఎఫ్ జెర్సీ క్రాస్, హెచ్ఎఫ్ క్రాస్, గిర్, సాహివాల్ తదితర జాతుల లింగ నిర్ధారిత వీర్య నాళికలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పిచ్చికుక్కల కాటు నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, మండల పశువైద్యాధికారి పి.అనిల్‌కుమార్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలో వరి విత్తనాలు పంపిణీచేస్తున్న ఎంపిపి రాంబాబు

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది, రెడ్డిపల్లి, అనంతవరం గ్రామాల సచివాలయాల వద్ద శనివారం వరి విత్తనాలను పంపిణీచేశారు. మద్ది గ్రామంలో ఎంపిపి రాంబాబు, తెలుగుదేశం మాజీ మండల అధ్యక్షులు కె.నగేష్‌కుమార్, రెడ్డిపల్లి గ్రామ సచివాలయం ప్రాంగణంలో మాజీ జడ్‌పిటిసి కె.దామోదరరావు అనంతవరం గ్రామ సచివాలయంలో భీమిలి మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ నాయుడు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేములవలస రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలు అందజేశారు. సాంబ మసూరి, ఎంటియు 1121, ఆర్‌జిఎల్ 2537 రకాల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నట్లు ఆర్‌బికె వ్యవసాయ సహాయకులు షేక్ అహ్మద్ గౌస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లంక కొండమ్మ, ఉప సర్పంచ్ కోరాడ నవీన్‌జ్ఞానేశ్వర్, కార్యదర్శి నరసింగరావు పాల్గొన్నారు.

'సేవాస్ఫూర్తి' సహాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : దీనావస్థలో ఉన్న ఓ కుటుంబానికి ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందించేందుకు రవీంద్రనగర్ కేంద్రంగా సేవలందిస్తున్న సేవాస్ఫూర్తి సంస్థ ముందుకొచ్చింది. ఆరిలోవ, తోటగరువు, బిఎస్ఆర్.నగర్‌లో ఉంటున్న ఓ కుటుంబంలో బోని లక్ష్మి తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టింది. ఆమెకు ఆరేళ్ళ చిన్న పాప, మతిస్థిమితం లేని అన్నయ్య కూడా ఉన్నారు. వీరికి సేవలు అందించడం వల్ల లక్ష్మి భర్తకు పనులకు వెళ్లే అవకాశం లేదు. దీంతో ఇరుగు పొరుగు వారు ఇస్తున్నది తింటూ జీవనం సాగిస్తున్నారు. దీనవస్థలో ఉన్న కుటుంబానికి సేవాస్ఫూర్తి సంస్థ తరపున ప్రతి నెలా 25 కిలోల బియ్యం, ఇతర కిరాణా సామగ్రి ఈ నెల నుంచి ఇచ్చేందుకు ముందుకొచ్చినట్లు అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. దీనిలో భాగంగా ఆ కుటుంబానికి శనివారం కిరాణా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎం.ప్రకాషపాత్రుడు, పద్మాజీ, లక్ష్మణ్, నందు, తాతారావు, నానాజీ, నారాయణరావు, ఎంవి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వేములవలస మార్కెట్ రూ.1.27 కోట్లకు వేలం

వేములవలస మార్కెట్ వేలంపాటలో పాల్గొన్న డిపిఒ

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండలం వేములవలస డైలీ మార్కెట్‌ను రూ. ఒక కోటి 27 లక్షలా 998కి ఎన్ని శంకర్రావు వేలంలో సొంతం చేసుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యాన గ్రామ పంచాయతీ విస్తరణ అధికారి రామారావు అధ్యక్షతన వేములవలస వేలంపాట శనివారం మధ్యాహ్నం నిర్వహించారు. గత ఏడాది 12 నెలలకు గానూ రూ.1.54 కోట్లకు పతివాడ పుష్పవతి వేలం పాడి ఆశీలు వసూలు చేసుకున్నారు. ఈ ఏడాది తొమ్మిది నెలల కాలాన్ని నిర్ణయిస్తూ వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో కోరాడ శ్రీనివాసరావు, ఎన్ని శంకరరావు, కోరాడ మహేష్, పతివాడ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. బహిరంగ వేలంలో పాటలో రూ.1.07 కోట్లకు కోరాడ శ్రీనివాసరావు హెచ్చు పాటదారుడుగా నిలిచాడు. అనంతరం సీల్డ్ కవర్లను ఓపెన్ చేయగా అందులో ఎన్ని శంకరరావు రూ.కోటి 27 లక్షల 998కి హెచ్చు కొటేషన్ వేయడంతో శంకరరావును హెచ్చు పాటదారుడుగా నిర్ణయిస్తూ వేలంపాటను ముగించారు.

జులై 1వ తేదీ నుంచి 31 మార్చి 2025 వరకు వేములవలస డైలీ మార్కెట్ ఆశీలు వసూలు చేసుకునే వెసులుబాటును కల్పిస్తూ అధికారులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో వేములవలస గ్రామ కార్యదర్శి నర్సింగరావు, శ్రీరామ్మూర్తి, స్థానిక సర్పంచ్ లంక కొండమ్మ, ఉపసర్పంచ్ నవీన్ జ్ఞానేశ్వరరావు పాల్గొన్నారు

రూ.40 లక్షలతో బస్‌బే నిర్మాణం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పాత బస్‌స్టాండ్ వద్ద రూ.40లక్షల జివిఎంసి నిధులతో బస్‌బే నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ ప్రయాణీకులు నిరీక్షించేందుకు ఏర్పాటు చేసిన చిన్నపాటి బస్ షెల్టర్‌ను, బెంచీలను తొలగించి నేలమట్టం చేశారు. బస్‌బే పేరుతో అధునాతన పద్ధతిలో బస్‌స్టాప్ ను నిర్మించనున్నట్లు జివిఎంసి ఒకటో జోన్ ఎఇ సుమన్ శుక్రవారం తెలిపారు. అలాగే పాత మీ సేవా కేంద్రం వద్ద మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు

నిర్మాణంలో ఉన్న బస్‌బే...

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం : మండలంలో పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపిడిఒ బి.శైలజ తెలిపారు. మండలంలో 3 నెల ఏరియర్స్‌తో కలిపి సాంఘిక భద్రత పింఛన్లు మొత్తం 8013 మందికి విడుదలైనట్లు పేర్కొన్నారు. పింఛన్లకు రూ.5కోట్లా, 24 లక్షలా, 79 వేలా 500 విడుదలైనట్లు తెలిపారు. రూ.3 వేలు ఉండే పెన్షన్ రూ.4 వేలకు, వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచినట్లు పేర్కొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని నాలుగు వార్డుల్లో 21 వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న 8,722 మంది పింఛను లబ్ధిదారులకు ప్రస్తుతం పెంచిన పింఛను మొత్తంతో రూ.5.97 కోట్లు చెల్లింపులు చేయనున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రూ.2.62 కోట్లు పింఛను సొమ్ము అందించేవారు.

గత ప్రభుత్వంలో రూ 3 వేలు ఇవ్వగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లు గీత, మత్స్యకార, ఒంటరి మహిళలు, ట్రాన్స్ జెండర్, డప్పు కళాకారులు ఇతరత్రా పింఛను దారులకు రూ.4 వేలును ఈ ప్రభుత్వం అందించనుంది. అలాగే వారికి ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి నెలకు రూ వెయ్యి చొప్పున రూ 3వేలు బకాయి కలిపి మొత్తం రూ 7వేలను జులై 1న ఇవ్వనుంది.

వికలాంగులు, క్షయ వ్యాధి బాధితుల పింఛను రూ 3వేల నుంచి రూ.6 వేలకు, పూర్తి అంగ వైకల్యం గల వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలకు, కిడ్నీ, లివర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచిన మేరకు ప్రభుత్వం ఇవ్వనుంది.

భీమిలి మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 13 గ్రామ సచివాలయాల ద్వారా 6,195 మందికి గత నెల వరకు వీరికి రూ.కోటి 81లక్షల 20వేల 500 ఇచ్చేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో వీరికి జులై 1న దాదాపు రూ.4 కోట్ల మేర చెల్లించనున్నారు.

50 లక్షల మొక్కలు నాటుదాం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖలో 50 లక్షల మొక్కలు నాటి పెంచడం ద్వారా 5 వేల టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తి చేద్దామని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం అన్నారు. శనివారం ఉదయం సీతమ్మధారలోని ఎస్‌ఎఫ్‌ఎస్ విద్యా సంస్థలో గ్రీన్ క్లైమేట్ టీం అందజేసిన పువ్వులు, ఔషధ మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. విత్తన బంతులతో విశాఖను హరిత వనం చేద్దామన్నారు. ఎస్‌ఎఫ్‌ఎస్ విద్యా సంస్థ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ విజయకుమార్ మాట్లాడుతూ, భూగోళం మీద సమస్త జీవరాశినీ కాపాడాల్సిన బాధ్యత మానవాళిదేనన్నారు. ప్రకృతి ఆధారిత పంటలు పండించిన ఆహారాన్నే ఆరగించాలన్నారు. జివిఎంసి ఎన్‌ఆర్‌యు ప్రతినిధి అక్షత మాట్లాడుతూ, విశాఖపట్నంలో అమలవుతున్న ఎకో వైజాగ్‌లో భాగంగా మొక్కలు నాటి పెంచే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఎస్‌ఆర్‌యు ప్రతినిధులు ప్రమీల, వివేక్, ఎక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధి కృష్ణకుమారి, ఎస్‌ఎఫ్‌ఎస్ విద్యా సంస్థ టీచింగ్ ఫ్యాకల్టీ శివ లక్ష్మి, జోసెఫ్ నవీనా, బి.జ్యోతి, ఫర్హానా బేగం, విద్యార్థులు మాట్లాడారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు శిక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు జిల్లాలోని అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యాన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ, ఎస్‌సిడిసి (లెప్రసీ కేసు డిటెక్షన్ కంట్రోల్) ప్రోగ్రాం మొదటి విడతలో భాగంగా 73 కేసులు గుర్తించామన్నారు. ఈసారి అన్ని కేంద్రాల్లో సర్వే చేసి కేసులు గుర్తించాలని తెలిపారు. ఈ సర్వేలో క్షేత్ర స్థాయి సిబ్బందిని వినియోగించుకొని ఖచ్చితమైన కేసులను గుర్తించాలన్నారు. జిల్లా లెప్రసీ, టిబీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు కుష్టు వ్యాధిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ అందించారు. ఈ సందర్భంగా పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ, ప్రతీ యుపిహెచ్‌సి, పిహెచ్‌సి పరిధిలో సరైన సర్వే చేసి కేసులు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.సత్యవేణి, సురేష్, నాగభూషణం పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-మాధవధార : మాధవధారలోని జివిఎంసి పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. 50వ వార్డు తెలుగుదేశం అధ్యక్షులు సనపల వరప్రసాద్ మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వం విద్యకు ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో 2023-24 సంవత్సరం పదవ తరగతిలో 594, 562 మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమలత, ఎంఇఒ సోమేష్, 50వ వార్డు జనసేన అధ్యక్షులు సనపల సాగర్, కూన వెంకటరమణ, సనపల రామకృష్ణ, సనపల నరసింహస్వామి, పైడి పుణ్యవతి, సనపల కీర్తి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు అదుపులో ఉంచాలని నిరసన

ప్రజాశక్తి-పెందుర్తి : సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్న కాయగూరల ధరలు అదుపులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య ఏరియా సమితి ఆధ్వర్యాన పెందుర్తి రైతు బజార్ వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులను దోచుకుంటున్న దళారీ వ్యవస్థను కట్టడిచేయాలని కోరారు. మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎమ్ఎ బేగం మాట్లడుతూ, నిత్యవసర వస్తువుల ధరలను కూడా తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి నాయకులు వై.రాంబాబు, జయ, స్థానిక శాఖ కార్యదర్శులు ఎన్.ఆసిరినాయుడు, అన్నపూర్ణ, పార్టీ సభ్యులు కె.రజినీ, రమణ, రామారావు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానానికి 'మై భారత్' దోహదం

ప్రజాశక్తి -ములగాడ: యువతలో ఆచరణాత్మక నాయకత్వానికి, సాంకేతిక పరిజ్ఞానానికి 'మై భారత్' పోర్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో నిర్వహించిన యువజన సదస్సులో ఆమె మాట్లాడుతూ, ఈ నెల 24వ తేదీన గీతం కళాశాలలో 'మై భారత్' పోర్టల్‌పై తాను, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి ఉత్తరి వై.అనసూయాదేవి ఒకరోజు శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యామని, అక్కడ నేర్చుకున్న విషయాలు యువతకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.

పేద మహిళల్లో 'కళంజియ' చైతన్యం

ప్రజాశక్తి- ములగాడ : పేద మహిళల్లో ఐక్యతను, చైతన్యాన్ని మల్కాపురం కళంజియ సమాఖ్య పెంచుతోందని ధాన్ ఫౌండేషన్ రీజినల్ కో-ఆర్డినేటర్ కె.రామ్‌కుమార్ తెలిపారు. కళంజిక సమాఖ్య సర్వ సభ్య ప్రతినిధుల సమావేశం శనివారం మరిడిమాంబ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కె.రామ్‌కుమార్ మాట్లాడుతూ, సమాఖ్య గత 20 సంవత్సరాల నుంచి మల్కాపురం ప్రాంతంలో ఉన్న 7 వార్డుల పరిధిలో 440 పొదుపు సంఘాలతో 6000 మంది కుటుంబాలతో పనిచేస్తూ ఉందన్నారు. సభ్యులందరూ కలిసి ఇంత వరకు రూ.18 కోట్లు పొదుపు చేసుకున్నారని, సభ్యులపైన మిగిలిన అప్పు రూ.30 కోట్లు ఉందని తెలిపారు. సమాఖ్యలో నాలుగో వంతు సభ్యులు బయట అప్పుల నుంచి బయటపడినట్లు చెప్పారు. విద్య, ఆరోగ్యం, జీవనోపాధి సంబంధిత అంశాలలో సమాఖ్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఆడిటర్ చలపతిరావు మాట్లాడుతూ లెక్కల్లో నిజాయతీ నూటికి నూరు శాతం ఉండడం వల్లనే ధాన్ ఫౌండేషన్‌పై ప్రజల్లో ఇంత నమ్మకం ఉందన్నారు. సభ్యులంతా చేయి చేయి కలిపి ఒక ఆసుపత్రిని నిర్మించుకోవడం మహిళా శక్తిని చాటిందని అభినందించారు. బ్యాంకు ఆఫ్ ఇండియా గాజువాక బ్రాంచి క్రెడిట్ మేనేజర్ రామ్‌కుమార్, సాగరతీర కళంజియ సమాఖ్య కో-ఆర్డినేటర్ సాయికృష్ణ మాట్లాడుతూ, నీతినిజాయతీలతో అట్టడుగు స్థాయి ప్రజలతో పనిచేస్తున్న ధాన్ ఫౌండేషన్‌తో కలిసి పనిచెయ్యడం తమకెంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో 2023-24 ప్రగతిని సమీక్షించుకుని, రాబోయే సంవత్సరంలో ప్రణాళికను సమాఖ్య స్థాయి నాయకులు ప్రతిపాదించగా ప్రతినిధుల సమక్షంలో చర్చించి ఆమోదించారు. చివరిగా సమాఖ్య కో-ఆర్డినేటర్ సుభాషిణి మాట్లాడుతూ సమాఖ్య అభివృద్ధిలో తోడ్పడుతున్న అన్ని సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు ఆదిలక్ష్మి, సెక్రటరీ ఆర్.రెయ్యమ్మ, ఉపాధ్యక్షులు నాగరత్నం, జాయింట్ సెక్రటరీ సరోజిని, కోశాధికారి హురున్నిషా, సమాఖ్య సిబ్బంది కృష్ణవేణి, లక్ష్మి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆలపాటి గిరిధర్

లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న ఆలపాటి గిరిధర్

ప్రజాశక్తి-యంత్రాంగం

లీగల్ : జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకొని కక్షిదారులు వ్యయ, ప్రయాసలు లేని న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆలపాటి గిరిధర్ సూచించారు. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా అనేక కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కోర్టులు ఉన్నచోట సుమారు 30 ప్రజా న్యాయ పీఠాలను ఏర్పాటుచేసి కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి తెలియజేశారు. సుమారుగా 3,500 కేసులు పరిష్కారాన్ని గుర్తించినట్లు తెలిపారు. నగరంలో అనేక కోర్టుల్లో ఇన్స్యూరెన్స్, చెక్ బౌన్స్, ప్రజా పోరసేవలో, జివిఎంసి, బ్యాంకు, ఇతర ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కొన్ని సివిల్ కేసులు కూడా పరిష్కారమైనట్లు వివరించారు.

204 కేసులు పరిష్కారం

భీమునిపట్నం : స్థానిక పిడిఎం కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 135 సివిల్, క్రిమినల్ కేసులు, ఫస్ట్ ఎడిఎం, సెకండ్ ఎడిఎం కోర్టుల ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌లో 69 సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారమైనట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఆయా కోర్టు ప్రాంగణాల్లో జడ్జిలు నాగేశ్వరరావు, సౌజన్య, ఆధ్వర్యాన లోక్ అదాలత్‌లు నిర్వహించారు. ఎపిపి రవితో పాటు, ఎజిపి, ఎంసిహెచ్ పాత్రుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి.పార్వతీశం, కార్యదర్శి కెఎస్ఎం.సుధాకర్, లోక్ అదాలత్ సభ్యులు దత్తి ఈశ్వరరావు, న్యాయ వాదులు పాల్గొన్నారు.

గోవిందరావు దంపతులు

నేడు సిర్లం గోవిందరావు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -గాజువాక : ఆర్‌టిసి కూర్మన్నపాలెం డిపోలో పనిచేస్తున్న కండక్టర్ శిర్లం గోవిందరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1962 సంవత్సరంలో విజయనగరం జిల్లా మక్కువలో జన్మించిన ఆయన డి.శిర్లాం స్కూల్లో పదో తరగతి వరకు చదివారు. బొబ్బిలిలో ఐటిఐ పూర్తి చేశారు. 1990లో ఆర్‌టిసి కండక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. 35 సంవత్సరాలు పాటు సేవలందించారు. ప్రస్తుతం ఎస్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా ఉన్నారు. ఉద్యోగంలో చేరిన నుంచి ఎస్‌డబ్ల్యూఎఫ్ మెంబర్‌గా కొనసాగుతూ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆర్‌టిసి కార్మిక సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. తోటి కార్మికులకు సహాయం చేయడంలో మొదటి నుంచీ ముందుండేవారు.

సిపిఐ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -ములగాడ : మురళీనగర్‌లో జులై 1, 2, 3 తేదీల్లో నిర్వహించే సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలను జయప్రదం చేయాలని సిపిఐ పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాంగ్రేగుల సత్య ఆంజనేయ పిలుపునిచ్చారు. సింధియా కూడలిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అచ్చినాయుడు తోటలో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్ల కేటాయింపులో అర్హులైన వారిని గత వైసిపి ప్రభుత్వం తొలగించిందని, ఇప్పుడు వచ్చిన కూటమి ప్రభుత్వం అర్హులైన వారిని గుర్తించి వెంటనే ఇల్లు మంజూరు చేయాలని, రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడాల రాంబాబు, నూనెల సూరిబాబు, గెండ అప్పారావు, గోపి, వీరినాయుడు, జగ్గారావు, శ్యామ్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన బుద్దెపు శ్రీనివాసరావును శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ కేవలం ఉద్యోగానికి మాత్రమేనని, జీవితానికి కాదని అన్నారు. ఉపాధ్యాయుల వృత్తి ఎంతో ఉన్నతమైనదన్నారు. 1986లో ఉపాధ్యాయునిగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఎనలేని సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు ఎస్‌వి.మహేష్ సన్మాన గ్రహీత శ్రీనివాసరావు జీవిత విశేషాలను సన్మాన పత్రంతో విశేషంగా వర్ణించారు. ఆనందపురం కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు చందక సూరిబాబు, స్వచ్ఛంద సేవకులు కొట్యాడ సత్యమూర్తి, ఎంపిటిసి సభ్యులు కొట్యాడ రమాదేవి, రెడ్డి బాబు, ఉపాధ్యాయులు కెజియా, భాస్కరరావు, సత్యనారాయణ, మహేష్, రాంప్రసాద్, శంకరరావు, ముత్యాల నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి అగ్రహారం ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న నెమలిపురి జగదీష్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖాధికారి పొన్నగంటి రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఇ.రాజేశ్వరి, శిరిడి ఆదిబాబు, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముద్రగడ సన్యాసిరావు, ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఆర్.జగదీష్‌బాబు, ఎపియుఎస్ జిల్లా అధ్యక్షులు

ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అవనపు అరుణ్‌కుమార్, ఎపిటిఎఫ్ నాయకులు ఎన్.పెద్దరాజు, యుటిఎఫ్ నాయకులు కె.సన్యాసిరావు, పిఆర్‌టియు నాయకులు రామారావు, నెమలపురి జగదీష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అయ్యన్నకు నూకాంబిక అమ్మవారి చిత్ర పటాన్ని అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకు స్పీకర్ పదవి ద్వారా అత్యున్నత గౌరవం ఇచ్చి ప్రధాన బాధ్యతలు అప్పగించారని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఎపి రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. పరిమితులకు లోబడి హుందాగా పని చేస్తానని పేర్కొన్నారు. స్పీకర్‌గా ఎన్నికై మొదటిసారిగా జిల్లాకు విచ్చేసిన అయ్యన్నపాత్రుడు శనివారం అనకాపల్లి ఎంపీ సీఎం.రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి అనకాపల్లి శ్రీనూకంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ముందుగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి దర్శించుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఆలయ గర్భగుడితో పాటు గుడి పరిసరాలను పరిశీలించి నిర్మాణ పనులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, టిడిపి నాయకులు దాడి జైవీర్, బత్తుల తాతయ్యబాబు, బుద్ధ నాగ జగదీశ్వరరావు, ప్రగాఢ నాగేశ్వరరావు, మళ్ల సురేంద్ర, దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి, అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, దేవస్థానం డిప్యూటీ కమిషనర్ కె.సుజాత, ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నకు కలెక్టర్, ఎస్‌పి ఆత్మీయ స్వాగతం

అనకాపల్లి : ఎపి అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతల చేపట్టిన తర్వాత తొలిసారి ఉమ్మడి విశాఖ జిల్లాకు వచ్చిన అయ్యన్నపాత్రుడుకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, ఎస్పీ కెవి.మురళీకృష్ణ విశాఖ విమానాశ్రయంలో శనివారం పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు.

అయ్యన్న బుద్ధ సత్కారం

అనకాపల్లి : స్పీకర్ అయ్యన్న పాత్రుడు శాసనసభ స్పీకర్ ఎన్నికైన సందర్భంగా శాసనమండలి మాజీ సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, టిడిపి ఎలమంచిలి నియోజవర్గం ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బోడి వెంకట్రావు, మళ్ల శివ నారాయణ పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్న విజయోత్సవ సభ

నర్సీపట్నం టౌన్ : స్పీకర్‌గా మొదటి సారిగా నియోజకవర్గం విచ్చేసిన చింతకాయల అయ్యన్న పాత్రుడుకు శనివారం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శ్రీ కన్య కూడలిలో కృష్ణ ప్యాలెస్ అధినేత బంగార్రాజు గజమాలతో స్వాగతం పలికారు. శాసనసభ స్పీకర్‌కు మున్సిపాలిటీలో అపూర్వ ఘన స్వాగతం లభించింది. స్థానిక ఎన్టీఆర్ మిని స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు భారీగా పార్టీ శ్రేణులు తరలివచ్చారు. అయ్యన్నతో పాటు హోం మంత్రి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ , అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ముత్యాల పాప, ఐటిడిపి ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యన్నకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్‌పి

స్పీకర్‌ను కలిసిన 'టీబీ' యూనిట్ నేతలు

మధురవాడ: విశాఖ వచ్చిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును వైద్య ఆరోగ్యశాఖ టీబీ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది తరుపున యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ ఎంవివి.గోపీనాథ్, సెక్రటరీ వి.వీరబ్రహ్మం, సిబ్బంది సునీత, మణి తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీబీ విభాగంలోని కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను స్పీకర్‌కు వివరించారు. దీనిపై అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ ఈ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

స్పీకర్‌కు ' దాడి' శుభాకాంక్షలు

సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన చింతకాలయల అయ్యన్న పాత్రుడును విశాఖ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దాడి సత్యనారాయణ మాట్లాడుతూ, స్పీకర్‌గా ఎన్నికైన అయ్యన్నపాత్రుడు బిసికి చెందిన ఉత్తరాంధ్ర జిల్లా వాసి అవ్వటం మన అందరికీ గర్వకారణం అన్నారు. రాష్ట్రంలో వెనుకబడి ఉన్న ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి అయ్యన్నపాత్రుడు కృషి చేయాలని కోరారు.

గణాంక పితామహునికి నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి

గణాంక పితామహుడు కీర్తిశేషులు ప్రశాంత చంద్ర మహలనోబిస్ జయంతి సందర్భంగా శనివారం 18వ జాతీయ గణాంక దినోత్సవం అనకాపల్లి జిల్లా అర్థ గణాంకశాఖ కార్యాలయంలో జిల్లా అర్థగణాంకశాఖాధికారి గేదెల రామారావు ఆధ్వర్యంలో జాతీయ గణాంకదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఓ రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరాన్ని "విధాన నిర్ణయం కోసం డేటాను ఉపయోగించడం" అనే థీమ్ ఎంచుకోవడం జరిగిందన్నారు. ఈ ప్రాధాన్యతను దృష్టిలో వుంచుకొని ఆర్థికవృద్ధి ఫలాలు ప్రజలకు అందాలనే సంకల్పంతో పని చేయాలని సూచించారు. దేశాభివృద్ధిలో డాటా ప్రాధాన్యతను వివరించి, డేటాను సమకూర్చుటలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమములో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుద్ధ నీటితో రోగాలకు దూరం

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజలకు పరిశుద్ధమైన మంచినీటిని తాగడం వల్ల అనేక వ్యాధులను దూరం చేయవచ్చని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు అన్నారు. తుమ్మపాలలో శనివారం సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వార్డ్ మెంబర్లు శానిటేషన్ వర్కర్లు మెడికల్ సిబ్బందికి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో మంచినీటిని టెస్టింగ్ చేసే విధానాన్ని సిబ్బందికి వివరించారు. పంచాయతీ పరిధి లో ఉన్న అన్ని మంచినీటి ట్యాంకులను క్లీన్ చేయించి ప్రతిరోజు బ్లీచింగ్ వేయించి పరిశుభ్రమైన తాగునీరును ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

వరి నారుమడుల సస్యరక్షణపై సూచనలు పాటించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి

వరి నారుమడుల్లో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచించిన పద్ధతులు రైతులు విధిగా పాటించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సిహెచ్ రామలక్ష్మి తెలిపారు. అనకాపల్లి మండలం బవులవాడ గ్రామంలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో ప్రధాన పంటలలో సమగ్ర సస్యరక్షణ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై వరి నారుమడుల్లో లో యాజమాన్య పద్ధతులు, వరి నాడుమడు వేసే విధానం, వరి నారు మడిలో వచ్చే తెగుళ్ళు, పురుగులు వాటి సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి అనకాపల్లి మండలంలో ఆర్‌జిఎల్ -2537, సాంబ మసూరు బిపిటి -5204, స్వర్ణ, ఎంటియు -1224 వంటి రకాలను రైతు సేవా కేంద్రం ద్వారా అందించామన్నారు. వరి నారుమడి వేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకుని వేసుకోవాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి తులసి కుమారి మాట్లాడుతూ రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి రామకృష్ణ, జిల్లా వనరుల కేంద్రం విస్తీర్ణ అధికారి, సాయి వాణి, బవులువాడ గ్రామ సర్పంచ్ మజ్జి లక్ష్మీ వెంకట అప్పారావు, ఎంపీటీసీ తోటాడ విజయ్, రైతు నాయకులు కోట్ని వెంకట సత్య ఈశ్వరరావు, మజ్జి అర్జున్ రావు, మండల గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలో ఆయన స్వగృహంలో కలుసుకొని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంగా నాగ జగదీష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా లోకేష్ దంపతుల భారీ చిత్రపటాన్ని లోకేష్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మళ్ల శివన్నారాయణ, పారిపల్లి శ్రీనివాసరావు, అప్పారావు పాల్గొన్నారు.



లోకేష్‌కు చిత్ర పటాన్ని అందజేసిన నాగజగదీష్ తదితరులు

డ్రైవర్ ఆలీకి సన్మానం

ప్రజాశక్తి -అనకాపల్లి : జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో డ్రైవర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్‌కె.ఆలీకి కార్యాలయ సిబ్బంది శనివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో కార్యాలయ అధికారి కె.ఇంద్రావతి మాట్లాడుతూ 1982లో ఇరిగేషన్ శాఖలో మెకానికల్ హెల్పర్‌గా విధులలో జాయిన్ అయి 1998లో సమాచార శాఖలో క్లీనర్గా విధులలో చేరి, 2004లో డ్రైవర్‌గా పదోన్నతి పొందినట్లు చెప్పారు. 42 సంవత్సరాలు సర్వీసును విజయవంతంగా నిర్వహించి నేడు డ్రైవర్ గా పదవీ విరమణ చేస్తున్న ఆలీని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఇ. ఎ.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మపాల పాల సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీ విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం-2లో ఇద్దరు డెయిరీ డైరెక్టర్లుగా కనుబుడ్డి సత్యనారాయణ (చిన్న), గుద్దేటి వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని మాజీ సర్పంచ్, అన్నపూర్ణ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి) శనివారం సత్కరించారు. పాల సొసైటీ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ జోనల్ సూపర్వైజర్ ఎడ్ల ఏసుదాసు, తుమ్మపాల పాల సంఘం2 అధ్యక్షులు పెద్దిశెట్టి బద్రి నారాయణ, సొసైటీల కార్యదర్శి దిమ్మల అర్జున, పాలకవర్గ సభ్యులు ఎం నాగరాజు పాల్గొన్నారు.

నీలకంఠరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి అనకాపల్లి పట్టణ మీడియా కోఆర్డినేటర్ ఎస్ భానుచందర్ తండ్రి నీలకంఠ రావు జన్మదిన వేడుకలు శనివారం రింగ్ రోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర సమక్షంలో కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 80వ డివిజన్ ఇంచార్జ్ బొడ్డేడ జోగి నాయుడు, 82వ డివిజన్ ఇంచార్జ్ పోలవరపు త్రినాధ్, ఆకుల నానాజీ, తలారి కాశీనాయుడు, సందిన సునీల్, దొడ్డి రాము, నంద్యాల గణేష్, కర్రి మహాలక్ష్మి నాయుడు, శివ, కిరణ్, కృష్ణ తదితరులు పుష్ప పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

కొణతాలకు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలపై గత ప్రభుత్వ హయాంలో సమ్మె చేసి కొన్ని జీవోలు సాధించామని, మరికొన్ని హామీలను మినిట్స్‌లో పొందుపరిచారని తెలిపారు. వాటిపై సానుకూలంగా స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రామకృష్ణను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముందుగా కొణతాలను పుష్పగుచ్ఛంతో అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణవేణి, తనూజ, కాసులమ్మ, ఉమనారాయణమ్మ, విజయ, భవాని, పుష్ప పాల్గొన్నారు.

నేడు గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-దేవరాపల్లి

శ్రీనివాసరావు

దేవరాపల్లి గ్రంథాలయాధికారి ఓ.శ్రీనివాసరావు ఈ నెల 30 ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. శ్రీనివాసరావు గ్రంథాలయాధికారిగా మంచి గుర్తింపు పొందారు. 1993 మే 1వ తేదీన పెదబయలు గ్రంథాలయాధికారిగా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. 1997లో దేవరాపల్లికి బదిలీపై వచ్చారు. మళ్లీ 2016లో విశాఖపట్నం అల్లిపురం లైబ్రేరియన్‌గా రెండు సంవత్సరాలు పనిచేశారు. అక్కడి నుంచి 2019లో ముంచంగిపుట్ లైబ్రరీయన్‌గా పనిచేస్తూ పెదబయలు బదిలీపై వెళ్లారు. 2022వ సంవత్సరంలో 60 సంవత్సరాలు పూర్తి కావడం, మరలా రెండు సంవత్సరాలు పొడిగించడంతో దేవరాపల్లి గ్రంథాలయానికి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం దేవరాపల్లి లైబ్రరీయన్‌గా, పెదబయలు ఇన్చార్జి లైబ్రరీయన్‌గా పనిచేస్తూ ఆదివారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

రైతులకు వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని తానాం గ్రామంలో సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వం రాయితీతో సరఫరా చేసిన వరి విత్తనాలను రైతులకు పంపిణీ చెసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పైల జగన్నాధరావు, వైస్ ప్రెసిడెంట్ వర్రి మంగలక్ష్మి వసంత రావు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య అభివృద్ధిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రభుత్వ విద్య పేదలు దూరమవుతుందని, నూతన ప్రభుత్వమైనా ప్రభుత్వ విద్య అందరికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎపి వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత మూడేళ్లల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక భారీగా తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది సుమారుగా 3 లక్షల మంది దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమాత్రం ఫలితం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన విలీన ప్రక్రియ కూడా సర్కారు బడికి శాపంగా మారిందన్నారు. రోజు రోజుకి ప్రభుత్వ విద్యకు దూరమవ్వడం ఆందోళన కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యపై నూతన ప్రభుత్వం దృష్టి సారించాలని వెంకన్న కోరారు.

పందివానిపాలెం పాఠశాలలో 'బడికి పోదాం'

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ పరిధి పందివానిపాలెం ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ శివలంక లక్ష్మి ఆధ్వర్యంలో శనివారం బడికి పోదాం అనే కార్యక్రమం నిర్వహించారు. డయేరియా, ఎనీమియా, విద్యార్థుల నమోదు తదితరవాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడి వర్కర్లు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాగుపాము కాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని చిన్నప్పన్నపాలెం గ్రామంలో పాము కాటుకు శనివారం ఒక మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన గుమ్మడి వరహాలమ్మ (60) శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తన ఇంటి ముందు ఉన్న వంగ చెట్టు నుండి కాయలు కోస్తుండగా ఆ పొదల్లో ఉన్న నాగుపాము ఆమెను కాటు వేసింది. దీంతో మహిళ తీవ్ర స్వస్థత గురి కావడంతో కుటుంబీకులు వైద్యం కోసం ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. పరిస్థితి విషమించి వరహాలమ్మ మృతి చెందింది.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

ప్రజాశక్తి-వడ్డాది : విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎంఈఓ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట ఎల్‌బిపి అగ్రహారం ఎంపిపి స్కూల్‌ను శనివారం ఆయన సందర్శించారు. మధ్యాహ్నం భోజనం రుచి చూశారు. పిల్లలకు వేడివేడిగా రుచిగా వండిపెట్టమని భోజన నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. స్కూల్ పరిసరాలను పరిశుభ్రం గా ఉంచాలన్నారు. అనంతరం లోపూడి-2 అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజు, వెంకట రమణ, అంగన్వాడీ టీచర్ కడియం జ్యోతి పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఓ కాశీ విశ్వేశ్వరరావు

ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి- కె.కోటపాడు

కె.కోటపాడు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అధికారులు పూర్తిస్థాయిలో పనిచేయాలని, నిధులు లేవన్న సాకుతో చిన్న చిన్న పనులను కూడా ఆటంకపరచకుండా పని చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు అధికారులతో అనేక విషయాలను చర్చించారు. ఏ శాఖలోనూ నిధులు లేవన్న చర్చ రాకూడదని, నిధులు విషయం తనకు పూర్తిగా వదిలివేయాలని, అభివృద్ధి విషయంలో మాత్రం అధికారులు పోటీ పడాలని సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలని, తరువాత పార్టీలను పక్కన పెట్టి మండలాన్ని అభివృద్ధి చేద్దామని హితవుపలికారు. స్టీల్ ప్లాంట్, హెచ్‌పిసిఎల్, విశాఖ పోర్టు ట్రస్ట్ తదితర భారీ కర్మాగారాల నుండి నిధులు సమీకరించి అనేక పనులు చేసుకోవచ్చని వెల్లడించారు. అనంతరం శాఖల వారీగా సమీక్షించారు. సరైన సమాచారం అందించలేకపోయినా ఐసిడిఎస్ ఏపీవో మంగతాయారును, సభకు హాజరుకాని ఎస్సీ, బీసీ వెల్ఫేర్ అధికారులపై బండారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పట్నాయక్, తహశీల్దారు ఈశ్వరమ్మ, చౌడువాడ, లంకవానిపాలెం సర్పంచులు దాడి ఎరుకునాయుడు, వేచలపు దొరబాబు, ఎంపీటీసీలు రాజేష్, వర్రి రామునాయుడు, రొంగలి సూర్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారును సత్కరిస్తున్న ఎంపిపి జగన్మోహన్

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సత్కారం

పోలీసులను సత్కరిస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లా పోలీసు విభాగంలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్) పి.సత్యనారాయణ రావు, డిటిసి డీఎస్పీ డి.రామవర్మతో పాటు మొత్తం 9 మంది పోలీసు అధికారులకు ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఎస్పీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అలాగే మాకవరపాలెం ఎఎస్ఐ ఎస్.సన్యాసిరావు, బుచ్చెయ్యపేట ఎఎస్ఐ వి.సిహెచ్.నాయుడు, వి.మాడుగుల ఎఎస్ఐ ఎస్.నాగరాజు, ఆర్ఎస్ఐ సిహెచ్.వెంకటరావు, నాతవరం ఏఎస్ఐ డి.బంగారు రాజు, కె.కోటపాడు ఏఎస్ఐ ఆర్.రాముడు, ఆర్మ్ రిజర్వ్ ఏఆర్ఎస్ఐ ఎల్.శంకరరావులకు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో అంకితభావంతో మంచి సేవలు అందించారని కొనియాడారు. పోలీసు ఉద్యోగం చాలా ఒత్తిడితో కూడుకున్నదని, ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీసు ఉద్యోగంలోనే జరుగుతుందన్నారు. సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖకు సేవలు అందించుటకు సహాయ సహకారాలు అందించిన వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ పొందినప్పటికీ జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా వచ్చి కలవవచ్చునని ఎస్పీ గారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణ మూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, మన్మధరావు, ఇతర అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సిఎస్ఆర్ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

ప్రజాశక్తి- అచ్యుతాపురం

లారస్ కంపెనీ సిఎస్ఆర్ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. మండలంలోని మోసయ్యపేట సంత స్థలాన్ని శనివారం ఎమ్మెల్యే విజయ్ కుమార్, లారస్ కంపెనీ ప్రతినిధులు తహశీల్దారు, ఎంపీడీవో తదితరులు సందర్శించారు. వర్షానికి బురద మయంగా మారిన స్థలాన్ని పరిశీలించారు. ముందుగా లోతట్టుగా ఉన్న సంత స్థలాన్ని ఎత్తు చేయాల్సి ఉందని, షాపులు నిర్మాణం చేసి అన్ని సమయాల్లో వ్యాపార లావాదేవీలు జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బి రామదాసు, నాయకులు ద్వారపురెడ్డి బాబ్జి, తహశీల్దారు రజని, ఎంపీడీవో సురేష్ కుమార్, రెవెన్యూ పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

అచ్యుతాపురం : మండల కేంద్రం అచ్యుతాపురం -మోసయ్యపేట జంక్షన్‌లో డ్రైనేజీ పనులపై ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. స్థానికులు, వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎలమంచిలి -గాజువాక ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పూడికపోయిన డ్రైనేజీనే యంత్రాల సహాయంతో శుభ్రం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పూడిక మట్టిని దూర ప్రాంతానికి తరలిస్తున్నారు. పనులు జరుగుతున్న పనితీరును ఎమ్మెల్యే విజయకుమార్ నిశితంగా పరిశీలిస్తున్నారు. పనులు చేస్తున్న సమయంలో ఇంటి యజమానులు ఎటువంటి అభ్యంతరాలు తెలిపిన వారికి ఆయన నచ్చజెప్పి సహకరించాలని కోరుతున్నారు. డ్రైనేజీ కాలువలు పూడికపోవటంతో రహదారిపై మురుగునీరు ప్రవహించేది. మురుగునీరు ప్రవాహానికి సమస్యకు మోక్షం కలిగింది.

డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నేడు యలమంచిలిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలిలో ఈ నెల 30న ఆదివారం సంకల్ప రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక కూరగాయల వ్యాపారి శ్రీనివాస బుజ్జి తెలిపారు. యలమంచిలి కొత్తపేట శివాలయం సమీపంలోని కూరగాయల షాపు వద్ద ఈ రక్తదాన శిబిరం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. రక్తదాన శిబిరం అనంతరం మొక్కలు పంపిణీ కార్యక్రమం కూడా చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొంటారని ఆయన తెలిపారు.

రైతులందరికీ వరి విత్తనాలు సరఫరా చేయాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని రైతులందరికీ సరిపడా వరి విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి వనము సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకున్నారని, విత్తనాల కొరతతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులకు ముందుచూపు కొరబడిందన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో వరి విత్తనాలు రైతులకు అందజేయడం వలన రైతులకు కొంత మేలు కలుగుతుందన్నారు. కాని సరిపడా విత్తనాలు అందజేయకపోవడంతో రైతులు ప్రైవేట్ డీలర్లను ఆశ్రయించడంతో వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. అయినా వ్యవసాయ అధికారులు పట్టించుకోలేదన్నారు. అధికారులు ముందుగా రైతులకు కావలసిన విత్తనాలను సిద్ధం చేసి ఉంటే రైతులకు ఈ ఇబ్బందులు ఉండేవి కావని పేర్కొన్నారు.

డి.శ్రీనివాస్ మృతికి ధర్మశ్రీ సంతాపం

ప్రజాశక్తి-చోడవరం : తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు డి.శ్రీనివాస్ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొని, సంతాపం వ్యక్తం చేశారు. తను కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఆయనతో ఎంతో సత్సంబంధం ఉండేదని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఉన్నప్పుడు అనేకమార్లు ఆయనతో పలు విషయాలపై చర్చించడం జరిగిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో శ్రీనివాస కృషి మరువలేనిదని తెలిపారు.

గంజాయి కేసులో 2 సంవత్సరాల జైలు

ప్రజాశక్తి-చోడవరం : గంజాయి కేసులో ముగ్గురు ముద్దాయిలకు చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి కోర్ట్ న్యాయమూర్తి రత్నకుమార్ రెండు సంవత్సరాల కారాగార శిక్ష, రూ.20వేలు జరిమానా శిక్ష విధిస్తూ శనివారం తీర్పు వెల్లడించారు. ముంచంగిపుట్టు మండలం మాకరం గ్రామానికి చెందిన ప్రధాని నాగేశ్వరరావు, ముక్కి సిద్దేశ్, ముఖి మోహన్ 2016లో చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద 15 కేజీల గంజాయితో పట్టుబడ్డారు. అప్పట్లో చోడవరం ఎస్సై నరసింహమూర్తి కేసును నమోదు చేశారు. కోర్టులో విచారణ జరిగిన నేపథ్యంలో నేరం రుజువు కావడంతో శిక్షణ ఖరారు చేశారు. ఈ కేసును పోలీసులు తరపున అడిషనల్ పిపి యు వెంకట్రావు వాదించారు.

శ్రీనివాసరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ చెందిన బి.శ్రీనివాసరావు దంపతులను శనివారం మండల విద్యాశాఖ అధికారి సిఆర్‌కె.దేవరాయలు, రజని ఘనంగా సన్మానించారు. శ్రీనివాసరావుకు సాలువ కప్పి పుష్పగుచ్చాలు ఇచ్చి సత్కరించారు. శ్రీనివాసరావు అందించిన సేవలను గుర్తు చేసి కొనియాడారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, పూజారి చిన్నబాబు, శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు శాస్త్రి, నూకరాజు, చిరంజీవి, శ్యామ్, అమ్మోరయ్య, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

అల్లూరి జయంతోత్సవాలకు ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ జెడ్‌పిటిసి

ప్రజాశక్తి-గొలుగొండ: జూలై 4న జరిగే అల్లూరి జయంతి ఉత్సవాలకు ఏఎల్ పురంలో అల్లూరి పార్కును సిద్ధం చేయడానికి శనివారం మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లూరి పార్కులో పేరుకు పోయిన పొదలను, చెత్తా చెదారాన్ని తొలగించారు. జులై 4న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చి అల్లూరి సీతారామరాజుకు. ఘనంగా నివాళు లర్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ హాజరు కానున్నారన్నారు.

4న అల్లూరి చిత్రకళా మందిరం ప్రారంభం

గొలుగొండ:కృష్ణదేవిపేట అల్లూరి స్మారక పార్కులోని ఆడిటోరియంలో అల్లూరి చరిత్రకు సంబంధించిన అద్భుతమైన చిత్రకళాఖండాలను శాశ్వతంగా ఏర్పాటు చేస్తున్న "అల్లూరి చిత్రకళా మందిరం"ను జూలై 4న ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభిస్తారని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు. శనివారం ఆడిటోరియంలో చిత్రపటాలు అమర్చడానికి పడాల వీరభద్రరావు, మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాదేటి రవి ప్రకాష్ తదితరుల బృందం అల్లూరి స్మారక పార్కు విచ్చేశారు. ఈ సందర్భంగా పడాల వీరభద్రరావు మాట్లాడుతూ, ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేష్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శులు అంబటి వరహాల రాజు, పల్లా భాస్కరమణి, లక్కాకుల బాబ్జి, కార్యవర్గ సభ్యులు పి.ఎస్. రవికాంత్, పంచాడ వెంకటరమణ పాల్గొన్నారు.

ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో లక్ష్మణేశ్వర స్వామి (శివాలయం)లో చోడవరం గ్రూపు దేవస్థానాలు ఈవో ఎస్‌వివి సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. గత ఏడాది మార్చి 24 నుండి ఈ ఏడాది జూన్ 28 వరకు హుండీ ద్వారా రూ.23,835లు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో బివిఎస్ఎస్ మురళికృష్ణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మహేష్, సంతోష్, ఆలయ పాలక మండలి తాజా మాజీ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, ఆలయ మాజీ చైర్మన్ కొంకిపూడి దొరబాబు పాల్గొన్నారు.

ఫాగింగ్ చేయిస్తున్న సర్పంచ్

గ్రామాల్లో ఫాగింగ్

ప్రజాశక్తి-గొలుగొండ: దోమల నివారణకు మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఆయా పంచాయతీల సిబ్బంది ఫాగింగ్ చేశారు. ఏఎల్ పురంలో సర్పంచ్ లోచల సుజాత, పాత మల్లంపేటలో సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మీ ఆనంద్ ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఫాగింగ్ చేశారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేయిస్తామని అధికారులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీను, రమణమ్మ, రాజేషు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నగదు జమ చేయాలి

ప్రజాశక్తి గొలుగొండ: పెన్షన్ పెంపు, ఒకటవ తేదీనే పంపిణీ చేయాలనే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు గొలుగొండ జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు అన్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ రెండవ స్థాయి సంఘం సమావేశంలో గొలుగొండ జడ్పిటిసి గిరిబాబు పలు సమస్యలపై స్పందిస్తూ మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు విడుదల చేసిన చేయూత, ఆసరా కొన్ని సంఘాలకు డబ్బు విడుదల చేసి కొన్ని సంఘాలకు ఎన్నికల కోడ్ కారణంగా పెండింగ్ జరిగిందన్నారు. ఆయా లబ్ధిదారులకు ఇంతవరకు అకౌంట్లో సొమ్ము జమ చేయలేదన్నారు. సర్పంచులను, ఎంపిటీసీలను గౌరవిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీ జరిగేటట్లుగా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన

ప్రజాశక్తి-చీడికాడ: మండలంలోని తురువోలు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశం శనివారం పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంకు ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి 2 బివి రమణ హాజరయ్యారు. ఈ సమావేశంలో పాఠశాల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల కె.రామకృష్ణ, సిబ్బంది జిపిఎ నాయుడు, సీఆర్పీ శ్రీను పాల్గొన్నారు..

మాట్లాడుతున్న ఎంఇఒ 2 రమణ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలని పాత మల్లంపేట సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి ఆనంద్ కోరారు. సోషల్ ఫారెస్ట్ లో భాగంగా శనివారం పాత మల్లంపేట పంచాయతీ శివారు దారమఠం పరిసర ప్రాంతాల్లో సోషల్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి భాగ్య ఆధ్వర్యంలో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అడవులు తగ్గిపోవడంతోనే పర్యావరణం లో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. సోషల్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి భాగ్య మాట్లాడుతూ, పాతమల్లంపేట పంచాయితీలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గెడ్డం ఆనంద్, పంచాయితీ సెక్రటరీ రవణమ్మ పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న సర్పంచ్

తోటల ధ్వంసం తగదు : మాజీ ఎమ్మెల్యే గణేష్

పరిశీలిస్తున్న గణేష్

ప్రజాశక్తి-నాతవరం:మండలంలోని వీరవరం గ్రామ పంచాయతీ సబ్బవరపు వెంకునాయుడుకు చెందిన జీడి, కొబ్బరి తోటలను గుర్తు తెలియని వ్యక్తులు పూర్తిగా ధ్వంసం చేయడాన్ని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర గణేష్ ఖండించారు. పంట పొలాలను శనివారం పరిశీలించారు. ఇటువంటి చర్యలకు పూనుకోవడం చాలా భాధాకరమన్నారు. సుమారు 5 నుండి 10 మంది వరకు ఈ దుశ్చర్యలో పాల్గొన్నట్లు తాము అనుమానం వ్యక్తం చేస్తున్నామన్నారు. వ్యక్తులపై కక్షతో ఈ విధంగా చేయడం సరికాదని, ఇటువంటి వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండలం వైసీపీ నాయకులు, పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు క్లోరినేషన్

ప్రజాశక్తి-నాతవరం:మండలంలోని ఎంబి పట్నం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి చినబాబు ఆధ్వర్యంలో మంచినీటి ట్యాంకును శుభ్రపరిచి క్లోరినైజేషన్ చేశారు. ఈ వర్షాకాల సీజన్లో అంటూ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిని తొలగించారు. అపారిశుధ్యంతో దోమలు వ్యాపించి మలేరియాచ డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు బారిన పడకుండా ఉండేందుకు ఈ ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ఈ ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి-చీడికాడ:బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మండలంలోని అర్జునగిరి గ్రామంలో ప్రధానోపాధ్యాయులు లెక్కల ప్రసాద్ ఆధ్వర్యాన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విలువలతో కూడిన ఉత్తమ విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని ఆయన అన్నారు.

నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం అల్లూరి మైత్రి గ్రంథాలయం వద్ద శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి (విశాఖపట్నం) సహకారంతో శనివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రముఖ నేత్ర చికిత్స నిపుణురాలు నికిత వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన 103 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 20 మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సిందని నిర్వాహకులు తెలిపారు. ఆపరేషన్ శంకర్ ఫౌండేషన్ ద్వారా చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్, లావణ్య, వరహాలు, గ్రంథాలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యురాలు

రైతుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-గొలుగొండ:రైతాంగ సమస్యలను పరిష్కారం కోసం శనివారం తహశిల్దార్ ప్రభాకర్‌రాజుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకులు మేకా సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాము నాయుడు మాట్లా డుతూ, స్మార్ట్ మీటర్లు రద్దు చేసి అధిక విద్యుత్తు చార్జీలు తగ్గించాలన్నారు. శాసనసభ సమావేశాలలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లును సభలో ప్రవేశపెట్టి ఆమోదించి రైతులను ఆదుకోవాలన్నారు. కల్తీ విత్తనాలను అరికట్టి వీటిని అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో మార్పులు తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు జి.గురు బాబు, సిపిఐ మండల నాయకులు మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణ, లగుడు సత్యనారాయణ, పావాడ ప్రసాద్, పి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నేతలు

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు పంచాయితీ డొంకినవలస ఎంపీపీ పాఠశాలలో 1 నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బ్యాగులను వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు శనివారం పంపిణీ చేశారు. అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలంటే ప్రాథమిక విద్య నాణ్యతగా ఉంటేనే సాధ్యమన్నారు. ప్రాథమిక విద్య బలోపేతానికి ప్రభుత్వ స్కూల్‌లను కేరళ రాష్ట్రంలో మాదిరిగా డిజిట లైజేషన్ చేయాలని కోరారు. బట్టి పట్టే చదువులు కాకుండా సృజనాత్మకతతో కూడిన విద్య అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజుబాబు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో వైద్యులను నియమించాలి

- వైద్య శిబిరాలు నిర్వహించాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఆసుపత్రుల్లో వైద్యులను నియమించి, గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కోరారు.స్థానిక ఏరియా ఆసుపత్రిని సిపిఎం నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, జ్వరాలు అరికట్టేందకు గ్రామాలలో పారిశుద్యంపై దృష్టి పెట్టి, దోమలను నియంత్రించాలన్నారు. గొలుగొండ మండలం కంఠారం, అప్పనన్నపాలెం, రోలుగుంట, కోటవురట్ల, కొయ్యూరు మండలాల రోగులు విష జ్వరాలతో బాధపడుతున్నారని, వీరంతా అసుపత్రిలో వైద్యం పొందుతున్నారని తెలిపారు.గ్రామాలలో పారిశుద్యం లోపించడంతో దోమల బెడద అధికమైందన్నారు.సరైన మంచినీటి సౌకర్యం లేదన్నారు. అసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి వైద్య సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. సిపిఎం కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామాలలో పారిశుద్యం, దోమల బెడద నివారణకు ప్రభుత్వం పటిష్ఠంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ అసుపత్రిలలో మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు అడిగర్ల రాజు, నారాయణముర్తి, గోవింద్‌రావు, చిరంజీవి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

రోగుల సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

1న ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పథకం అమల్లో భాగంగా జూలై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే పెన్షన్లు పంపిణీ ప్రారంభించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. నక్కపల్లి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో శనివారం పెన్షన్ నగదు డ్రా చేసేందుకు వచ్చిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడారు. మండలం లోని 22 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో లబ్ధిదారులందరికీ ఇంటి వద్ద పెన్షన్ అందజేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, పెద్దలకు తెలియపరచి సోమవారం ఉదయం 6 గంటలకే పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు.

కోటవురట్ల:ప్రభుత్వం తొలిసారిగా అందజేస్తున్న పింఛన్లను సకాలంలో పంపిణీ చేయాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 9,611 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు రూ.4000 పెన్షన్, రూ.3వేలతో కలిపి రూ.7వేల చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. పంపిణీని సోమవారం సాయంత్రం లోపు అందజేయాలని సూచించారు.

ఖర్చుల వివరాలు సమర్పించాలి

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుల వివరాలను రెండు రోజుల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు, ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో చేసిన ఖర్చులను సంబంధిత రికార్డులలో నమోదు చేసి నియోజక వర్గం వ్యయ పరిశీలకులతో రికన్సిలేషన్ చేసి సమర్పించాలని సూచించారు. వాటిని పూర్తిగా పరిశీలించిన తరువాత ఎన్నికల కమిషన్కు పంపించవలసి ఉంటుందన్నారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో భారీ పేలుడు

- పరుగులు తీసిన సిబ్బంది, గ్రామస్తులు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట పోలీస్ స్టేషన్లో ఆవరణలో గతంలో గంజాయి కేసులో సీజ్ చేసిన కంటైనర్లో భారీ పేలుడు చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం జరిగిన ఈ భారీ పేళ్లుల్లు శబ్దాలకు స్టేషన్లో సిబ్బంది భయం తో పరుగులు తీశారు. భారీ శబ్దాలకు గ్రామానికి చెందిన పలువురు స్టేషన్‌కు తరలివచ్చారు. ఏ ఒక్కరు సంఘటన స్థలానికి వెళ్లేందుకు సాహసించ లేదు. 2019లో గంజాయి కేసులో ఈ కంటైనర్ ను సీజ్ చేసి నట్టు కొత్తకోట ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. పేలుడు కారణం గా కంటైనర్ పూర్తిగా కాలిపోగా ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదని తెలిపారు. స్టేషన్ భవనానికి ఎటువంటి నష్టం వాటిల్ల లేదని ఎస్ఐ తెలిపారు. మంటలను నర్సీపట్నం అగ్ని మాపక కేంద్రం సిబ్బంది అదుపు చేశారు.పిడుగుపడి కంటైనర్ లో మంటలు వ్యాపించాయని పోలీసులు చెబుతుండగా ఎటువంటి ఉరుములు, మెరుపులు, వర్షం లేకుండా పిడుగు ఎలా పడిందని పలువురు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

దగ్ధమవుతున్న కంటైనర్

జివిఎంసిలో 78 మంది ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో శనివారం 78 మంది అధికారులు, ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందారు. ఇంతమంది ఒకేసారి ఉద్యోగ విరమణ పొందడం జివిఎంసి చరిత్రలోనే ప్రప్రథమమని జివిఎంసి అదనపు కమిషనరు డాక్టర్ వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగికీ ఉద్యోగ విరమణ తప్పనిసరని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితాన్ని సుఖశాంతులతో, కుటుంబంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. శనివారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్లు ఎస్ఎస్.వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు పి.రవిక్రిష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్‌లతో కలిసి ఉద్యోగుల విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు పి.పద్మజ, బయాలజిస్టు సాంబమూర్తి, జెమ్స్ అసోషియేషన్ ప్రతినిధి అప్పలనాయుడు, ఎపిఎంఇఎస్ఎ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, రవి, సన్యాసిరావు పాల్గొన్నారు.

ఉద్యోగిని సత్కరిస్తున్న అధికారులు

అభివాదం చేస్తున్న హోం మంత్రి అనిత

హోం మంత్రి అనితకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-కోటవురట్ల: రాష్ట్ర హోం మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మండలం మీదుగా వెళుతున్న వంగలపూడి అనితకు శనివారం మండల కేంద్రంలో కూటమి నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అసెంబ్లీ సభాపతిగా నియమితులైన అయ్యన్నపాత్రుని విజయోత్సవ వేడుకలో పాల్గొనేందుకు ఆమె మండలం మీదుగా నర్సీపట్నం వెళ్లారు. ఈ సందర్భంలో నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. త్వరలో మండలాన్ని సందర్శిస్తానని ఈ సందర్భంగా ఆమె అన్నారు.

వ్యర్థాలను గెడ్డల్లో వేయొద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలు ప్లాస్టిక్, ఇతర చెత్త వ్యర్థాలను కాలువలు, గెడ్డల్లో వేయకుండా పరిశుభ్రతకు సహకరించాలని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు కోరారు. శనివారం వార్డు పరిధి శ్రీహర్స్ జంక్షన్ వద్ద ఎస్-ఎల్ కెనాల్‌లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్న సమాచారం తెలుసుకుని పారిశుధ్య సిబ్బందితో దగ్గర ఉండి పూడిక తీయించి సమస్యను ఆయన పరిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజులుగా పడుతున్న వర్షాలకు వార్డులో ఉన్న ప్రధాన కాలువల్లో ప్లాస్టిక్, ఇతర చెత్త వ్యర్థాలతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. స్థానికులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న వెంటనే సమస్య పరిష్కరించామన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
GIMSR
GITAM INSTITUTE OF MEDICAL SCIENCES AND RESEARCH

డాక్టర్స్ డే ప్రత్యేక సంచిక ఆవిష్కరణ
మరియు
ఉచిత వైద్య శిబిరం

ప్రారంభ సభ
తేది: 30-06-2024 (ఆదివారం) ఉదయం 9.00 గంటలకు
వేదిక : కమ్యూనిటీ హాల్, ఫకీర్‌తక్యా, గాజువాక

ఉచిత వైద్య శిబిరం ప్రారంభకులు
ఎ.అజ శర్మ
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి

డాక్టర్స్‌డే ప్రత్యేక సంచిక ఆవిష్కర్త
డా॥ పి.వి.రమణమూర్తి, ఎం.డి,
కళా ఆసుపత్రి, విశాఖపట్నం

గౌరవ అతిథులు
డా॥ వై.ఎల్.నరసింగరావు, MD (OBG),
రిటైర్డ్ ప్రొఫెసర్, ఆంధ్రమెడికల్ కాలేజ్, కెజిహెచ్, విశాఖపట్నం
డా॥ సరిత సురేష్, M.D.,F.R.M.
Aaradhya Fertility Centre
హిమామ్ హుస్సేన్, గ్రామ ప్రెసిడెంట్
ఫకీర్‌తక్యా గ్రామం, గాజువాక
ఎం.వెంకటేశ్వరరావు, జనరల్ మేనేజర్
ప్రజాశక్తి, విశాఖపట్నం.

సభాధ్యక్షులు : ఎన్.మధుసూదనరావు,
ప్రజాశక్తి బ్యూరో ఛీఫ్, విశాఖపట్నం.

అందరూ ఆహ్వానితులే !
ప్రజాశక్తి సాహితీ సంస్థ, విశాఖపట్నం

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ